సాక్షి
విజయనగరం

శనివారం । 19 । అక్టోబర్ । 2024

ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా విజయసాయి రెడ్డి





వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం ఈ నియామక ప్రకటనను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేసిన అనుభవంతో పాటు అందరికీ సుపరిచితుడు కావడంతో పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా పనిచేసిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఉమ్మడి చిత్తూరు, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. శాసన మండలి ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణను ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమించారు. – సాక్షి ప్రతినిధి, విజయనగరం



వారేమి చేశారు పాపం..!

లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన టీడీపీ నేతలు అధికారం చేపట్టిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పైడితల్లి తెప్పోత్సవానికి ఏర్పాట్లు



హంస వాహనానికి రంగులు

విజయనగరం టౌన్: సిరులతల్లి సిరిమానోత్సవం పూర్తయిన మరుసటి మంగళవారం పెద్ద చెరువులో నిర్వహించ తలపెట్టిన తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక సున్నంబట్టీ వీధి నుంచి పెద్దచెరువు వద్దకు అధికారులు చేరుకుని అక్కడ ప్రత్యేక గదిలో భద్రపరిచిన తెప్పకు సంబంధించిన వస్తువులన్నింటిని బయటకు తీయించి, వాటిని పర్యవేక్షించారు. అమ్మవారి తెప్పోత్సవానికి ఎటువంటి ఆటంకాల్లేకుండా చూస్తున్నారు. ముందస్తుగా పెయింటింగ్‌లు, డ్రమ్ముల పనితీరు, ఐరెన్ తదితర వాటిపై ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండురోజుల్లో తెప్పోత్సవం ట్రయల్ రన్ వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులైన టీచర్లకు ఓటు హక్కు కల్పించండి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, డీఈఓ ప్రేమ్‌కుమార్

విజయనగరం అర్బన్: జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత కోరారు. దీనికోసం విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ సందర్భంగా వివరించారు. నవంబర్ 6లోగా ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరించాలని ఆమె సూచించారు. నవంబర్ 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ భీమశంకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.


బాధ్యతలు చేపట్టిన పీటీసీ ప్రిన్సిపాల్



రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: పోలీసు శిక్షణా కళాశాల (పీటీసీ) ప్రిన్సిపాల్‌గా డి.రామచంద్రరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పల్నాడు అడిషనల్ ఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై విజయనగరం పీటీసీ ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన పీటీసీ అభివృద్ధిని కొనసాగిస్తూ, రాష్ట్రంలో మంచి శిక్షణా కళాశాలగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సోషల్ మీడియా, క్రైమ్‌పై సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. క్రిమినల్ చట్టాలపై పోలీస్ సిబ్బంది అందరికీ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అవుడోర్ సిబ్బంది ఇచ్చిన గార్డ్ ఆఫ్ హానర్‌ను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి.అప్పారావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ కోచ్‌ల శిక్షణ శిబిరానికి శ్రీనివాసరావు




శ్రీనివాసరావు

శృంగవరపుకోట: విజయనగరం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థలో పే అండ్ ప్లే బ్యాడ్మింటన్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న గుంట్రోతు శ్రీనివాసరావు భారత్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ నిర్వహిస్తున్న భారత్ కోచెస్ శిక్షణకు ఎంపికయ్యారు. దీంతో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ధర్మవరం జెడ్పీ హైస్కూల్ పీడీ పి.శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 29 వరకూ చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజధాని రాయపూర్‌లో భారత్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహిస్తున్న భారత్ కోచ్‌ల శిక్షణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ శ్రీనివాసరావును ఎంపిక చేసినట్లు చెప్పారు.



నెల్లిమర్లలో పంప్‌హౌస్



డయేరియా సోకిన గుర్ల గ్రామం

ప్రజల ప్రాణాలతో చెలగాటం



గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ బెంచీలపై చికిత్స పొందుతున్న రోగులు

- వారం రోజులుగా గుర్లలో విజృంభిస్తున్న డయేరియా
- ఇప్పటి వరకు 9 మంది మృతి, 450 మందికి పైగా బాధితులు
- స్వచ్ఛంద కర్ఫ్యూను తలపిస్తున్న గుర్ల
- పేదల కుటుంబాల్లో నెలకొన్న విషాదం
- వారం రోజులు కావస్తున్నా సర్వే చేయడంలో నిర్లక్ష్యం
- డయేరియా ప్రబలడానికి కారణాలు తెలుసుకోలేని దుస్థితి
- కనిపిస్తున్న వలంటీర్ వ్యవస్థ లేని లోటు
- సమన్వయ లోపం.. పొంతనలేని ప్రకటనలు
- రాష్ట్ర మంత్రి వచ్చి వెళ్లినా ప్రయోజనం శూన్యం

సాక్షి ప్రతినిధి, విజయనగరం/చీపురుపల్లి/గుర్ల:

ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అదే ప్రాణాలతో చెలగాటమాడుతోంది. అధికారులను సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా చూసుకోవాల్సిన సర్కారు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. గుర్ల మండలాన్ని వారం రోజులుగా డయేరియా వ్యాధి పట్టి పీడిస్తున్నప్పటికీ దాదాపు పదుల సంఖ్యలో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా, 450 మంది వరకు మంచాన పట్టినప్పటికీ ప్రభుత్వంలోగానీ, అధికారుల్లోగానీ ఎలాంటి చలనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలినప్పటి నుంచి ఇంతవరకు డయేరియా లక్షణాలతో ఎనిమిది మంది, మనస్తాపంతో ఒకరు మృతి చెందారు. 450 మంది వరకు డయేరియా చికిత్స పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అసలు డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణాలు ఏమిటి, ఏ రకంగా డయేరియా వ్యాధిని అదుపులోకి తీసుకురావాలి, 450 మంది మాత్రమేనా ఇంకా వ్యాధి లక్షణాలతో ఇళ్లల్లో ఎంత మంది బాధపడుతున్నారు అనే అంశాలపై ఇప్పటికీ యంత్రాంగం వద్ద స్పష్టత లేదనే చెప్పుకోవాలి.

మరో ఇద్దరి మృతి..

డయేరియా లక్షణాలతో ఇంతవరకు ఏడుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం గుర్ల గ్రామానికి చెందిన పతివాడ సూరమ్మ డయేరియా లక్షణాలతో ఇంటి వద్దనే చికిత్స పొందుతూ మరణించింది. అంతేకాకుండా ఈ నెల 14న మృతి చెందిన కలిశెట్టి సీతమ్మ కుమారుడు కలిశెట్టి రవి గత నాలుగు రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై తల్లి లేదనే ఆవేదనకు గురై శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది.

కనిపిస్తున్న వలంటీర్ వ్యవస్థ లేని లోటు

ఇదిలా ఉండగా గుర్లలో డయేరియా వ్యాధి విజృంభణ ప్రారంభమై వారం రోజులు కావస్తోంది. ఇంత వరకు ఆస్పత్రికి వస్తున్న వారే తప్ప ఇళ్లల్లో మరెంత మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో, ప్రైవేటు ఆస్పత్రులను ఎంతమంది ఆశ్రయిస్తున్నారో యంత్రాంగం వద్ద లెక్కలు లేవు. ఎనిమిది మంది మరణిస్తే తప్ప ఇంటింటికి సర్వే చేయాలనే ఆలోచన యంత్రాంగానికి రాకపోవడం శోచనీయం. డయేరియా వ్యాధి ప్రబలి ఎనిమిది మంది మృతి చెంది, 450 మంది వరకు ఆ లక్షణాలతో బాధపడుతున్న సమయంలో శుక్రవారం గుర్ల వచ్చిన కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ సమయంలో గ్రామంలో అందరికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ గుర్తొచ్చింది. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని సైతం ఎదురించి ప్రజల కోసం నిలబడిన వలంటీర్ వ్యవస్థ ఇలాంటి సమయాల్లో ఎంత అవసరమో స్పష్టమైంది.



డయేరియా ప్రబలడానికి చంపావతి నది నుంచి వచ్చిన తాగునీరే కారణమని ఒకరు, కాదు ఊరిలో ఉన్న ప్రైవేటు బోర్లు కలుషితమవ్వడంతోనే ఇలా జరిగిందని మరొకరు, కాదు కాదు చంపావతి నీరే కారణమని ఇంకొకరు ఇలా ఎవరికి నచ్చిన ప్రకటనలు వారు ఇచ్చుకుంటూ కాలం గడుపుతున్నారు తప్ప ప్రజలకు స్పష్టత ఇవ్వడం లేదు.

పేద కుటుంబాల్లో విషాదం

డయేరియా మహమ్మారి విజృంభణకు ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఎనిమిది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఒకే ఇంటిలో డయేరియాతో తల్లి మృతి చెందగా, తల్లి లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేక కొడుకు ప్రాణాలు వదిలాడు. ఇలా ఎంతో మంది పేదల కుటుంబాల్లో డయేరియా విషాదాన్ని మిగుల్చుతోంది. గురువారం సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రామానికి వచ్చి ప్రజలకు భరోసా కల్పించిన తరువాత మరో ఇద్దరు మృతి చెందడంతో ప్రజల ప్రాణాలంటే సర్కారుకు లెక్కలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అస్వస్థతకు గురైన ఏఎన్ఎం

మండల కేంద్రంలో ఐదు రోజులుగా డయేరియా కేసులు బారినపడిన వారికి విధి నిర్వహణలో భాగంగా తన వంతు వైద్య సహాయం అందిస్తున్న సంతోషి శుక్రవారం అస్వస్థతకు గురైంది. ఒక్కసారిగా బీపీ తగ్గడంతో గుర్ల జెడ్పీ హైస్కూల్‌లోని వైద్య శిబిరం వద్ద కుప్పకూలిపోయింది. సహచర ఉద్యోగులు ఆమెకు సపర్యలు చేసి వైద్యం అందించడంతో గంట తర్వాత ఆమె కొలుకుంది. డయేరియా కేసులు నమోదు ప్రారంభం అయినప్పటి నుంచి విరామం లేకుండా పని చేయడంతో పాటు సమయానికి తగిన ఆహారం తీసుకోకపోవడంతో అస్వస్థతకు గురైనట్లు సహచర వైద్య సిబ్బంది చెబుతున్నారు.



నిర్మానుష్యంగా మారిన వీధులు

గుర్లలో స్వచ్ఛంద కర్ఫ్యూ

ఈ నెల 12న ఎనిమిది మందితో గుర్లలో డయేరియా వ్యాధి ప్రారంభమయ్యింది. ఆ తరువాత 13న చింతపల్లి అప్పారావు అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 14న మరో ముగ్గురు మృతి చెందారు. ఇక అప్పటి నుంచి కేసుల సంఖ్య కూడా వందల్లో పెరుగుతూ వచ్చింది. దీంతో భయాందోళనలకు గురైన గ్రామస్తులు స్వచ్ఛంద కర్ఫ్యూ ప్రకటించుకున్నారు. ప్రస్తుతం గుర్ల మండల కేంద్రంతో పాటూ ఊరిలో ఎక్కడ చూసినా కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. గ్రామంలో ఒక్క దుకాణం కూడా తెరుచుకోలేదు. అంతేకాకుండా ఇళ్ల తలుపులు సైతం మూసుకునే దర్శనమిస్తున్నాయి. కరోనా సమయంలో కూడా లేని భయం ప్రస్తుతం గుర్ల వాసుల్లో కనిపిస్తోంది. వీధుల్లో, రోడ్లపై ఒక్కరూ కూడా కనిపించడం లేదు.



గుర్లలో డయేరియా రోగుల సమాచారం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మద్యం దుకాణం ఏర్పాటుపై...
మహిళల తిరుగుబాటు

- పచ్చని సంసారాల మధ్య చిచ్చు పెడతారా..?
- మహిళలను తిరగనివ్వరా..?



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బొబ్బిలి: పచ్చని సంసారాలతో గుట్టుగా కాలం వెళ్లదీస్తున్నాం... మా కాపురాల మధ్య బ్రాందీలు అమ్మి మా సంసారాలు చెడగొట్టవద్దంటూ మహిళలు కన్నెర్ర చేశారు. పట్టణంలోని మేదరిబంద జంక్షన్ వద్ద ప్రైవేటు లైసెన్సుదారులు వైన్స్ షాపు ప్రారంభించారు. జనావాసాల మధ్య వైన్స్ షాపు పెట్టేందుకు మీకు అనుమతులు ఎవరిచ్చారని ఆ ప్రాంతానికి చెందిన మహిళలంతా షాపు వద్ద శుక్రవారం బైఠాయించారు. తమ నిరసనను వ్యక్తపరుస్తూ నినాదాలు చేశారు. వైన్స్ షాపు వచ్చిన రాంబాబు, బాబూరావులు వారితో మాకు లైసెన్సు వచ్చింది... మాకు నచ్చిన చోట షాపు పెట్టుకుంటామని వారికి నచ్చజెప్పేలా వాదనకు దిగారు. దీంతో గలాటా పెద్దదయింది. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది వచ్చి మద్యం అమ్మకందారులకు మద్దతుగా మాట్లాడటంతో నిరసనకారులు మరింత ఆందోళన చెందారు. నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులు ఫొటోలు తీయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ షాపు ఇక్కడ పెట్టేందుకు అంగీకరించబోమని మహిళలు భీష్మించారు.

అధికారులకు బాధ్యత లేదా?

వైన్ షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చని చంద్రబాబునాయుడు చెప్పినట్టు ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులకు వంతపాడటం సరికాదని సీపీఎం జిల్లా నాయకులు పొట్నూరు శంకరరావు అన్నారు. మద్యం షాపుల వద్ద నిరసన చేస్తున్నప్పుడు అధికారులు కూడా ఆలోచించకుండా ఎలా వత్తాసు పలుకుతారన్నారు. బడి, గుడి, జనావాసాల కూడళ్ల వద్ద వైన్ షాపులు పెట్టకూడదన్న నిబంధనలను సుప్రీంకోర్టు సైతం పలు మార్లు గుర్తుకు తెస్తున్నప్పటికీ అధికారులు మద్యం వ్యాపారులకు మద్దతుగా నిలవడం ఆశ్చర్యకరమన్నారు. సీఐ తదితర అధికారుల తీరును మేం తీవ్రంగా ఖండిస్తున్నామని శంకరరావు అన్నారు. దీపావళికి బాణ సంచా ఊరి చివర పెట్టినా వెళ్లి కొనుగోలు చేసినట్టే మద్యం కూడా ఊరి చివరే పెట్టుకోవాలని ప్రొఫెసర్ రావాడ సత్యనారాయణ అన్నారు. అనంతరం అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చిన 10 రోజుల్లోగా మీ నిరసనల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో తాత్కాలికంగా మహిళలు నిరసనను విరమించారు.



నిరసన కారుల ఫొటోలను తీస్తున్న పోలీసులు, స్థానికులతో వాదులాడుతున్న మద్యం షాపు యజమానులు

పాలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

- లీటరుకు కనీసం రూ.10లు పెంచాలి
- పాడి రైతుల జిల్లా సదస్సులో రైతు సంఘం నేతల డిమాండ్

జామి: పాడి రైతుల నుంచి సేకరించిన పాల ధరకు, ప్రైవేటు డెయిరీదారుల అమ్మకాలకు మధ్య ధర వ్యత్యాసం ఉందని పాలకూ కనీస మద్దతు ధర ప్రకటించాలని పాడి రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జామిలో పాడి రైతుల జిల్లా సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవు పాల ధరను విశాఖ డెయిరీ తగ్గించిన రూ.3ల నిర్ణయాన్నివెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ధాన్యం తదితర పంటల కనీస మద్దతు ధర ప్రకటించిన విధంగానే పాలకు కూడా మద్దతు ధర ప్రకటించాలన్నారు. పాడి రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని కాయకష్టం చేసుకుంటే విశాఖ డెయిరీతో పాటు హెరిటేజ్ వంటి ప్రైవేటు డెయిరీలు వారి కష్టాన్ని దోచుకుంటున్నాయని మండిపడ్డారు. రైతుల నుంచి సేకరించిన పాల ధరకు, మార్కెట్లో ప్రైవేటు డెయిరీదారుల అమ్మకాలకు మధ్య రూ.23 వ్యత్యాసం ఉందన్నారు. వాటిలో కనీసం రూ.10 లీటరుకు పాడి రైతులకు అందించాలన్నారు. డెయిరీ చెల్లించే ధరకు అదనంగా ప్రభుత్వం పోత్సాహకంగా రూ.8లు చెల్లించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పాల ఉత్పత్తులను నిషేధించాలన్నారు. పాల ఉత్పత్తులు, యంత్రాలపై జీఎస్‌టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాడి పశువులకు రాయితీపై బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. పశువుల దాణాను 75 శాతం రాయితీపై రైతులకు అందించాలని కోరారు. పాల సొసైటీలకు నిధులిచ్చి ఆర్థిక పరిపుష్టి కల్పించాలన్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారానికి రైతులంతా సంఘటితం కావాలని నేతలు పిలుపునిచ్చారు. అనంతరం జామి బస్టాండ్‌లో తమ డిమాండ్ల సాధనకు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు చల్లా జగన్, మద్దిల రమణ, గోపాలం, జి.అప్పారావు, గొర్లె రవికుమార్, బందారు పెదబాబు, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పాల సంఘం కమిటీ ఎన్నిక

సదస్సు అనంతరం జిల్లా పాలరైతుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లోకవరపు ఆదినారాయణ, కార్యదర్శిగా గొంప రామకృష్ణను ఎన్నుకున్నారు.



జామి బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న పాడి రైతులు, రైతు సంఘం నేతలు

‘ఉల్లాస్’తో మహిళల్లో అక్షరాస్యత పెంపు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని నవంబరు 5న జిల్లాలో ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 48,578 మంది మహిళలను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. వీరిని గుర్తించేందుకు ఈ నెల 24లోగా సర్వే పూర్తి చేసి, జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 29న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, నవంబరు 2న మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సుమారు 4,800 వీటీ (వలంటీర్ టీచర్)ల ద్వారా వీరికి బోధన జరుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. పొదుపు మహిళా సంఘాల్లోని చదువుకున్న వారిని వీటీలుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 15 ఏళ్లు దాటి నిరక్షరాస్యులైన పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులు, కాపలాదారులు, అంగన్‌వాడీ సహాయకులు, వివిధ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న నిరక్షరాస్యులతో పాటు పారిశుద్ధ్య కార్మికులను కూడా ఎంపిక చేసి అక్షరాస్యులుగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, వయోజనవిద్య డీడీ అల్లు సోమేశ్వరరావు, ఏఓ సీహెచ్‌ఆర్‌సీడీ లక్ష్మీ, డీఎల్‌డీఓ నిర్మలాదేవి, డీఎల్‌డీఓ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

వర్షాలపై అప్రమత్తంగా వుండాలి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, వచ్చే మూడు నాలుగు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా మరింతగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 22న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, అది ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన దృష్ట్యా అధికారులు తమ మండలాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు తీరప్రాంత మండలాల పరిధిలోని గ్రామాల్లో తుఫాన్ షెల్టర్ల పరిస్థితిపై నివేదించాలని చెప్పారు. కల్వర్టులు, డ్రైనేజీ కాల్వలు, వాగులు వంటి చోట్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వచ్చే పది రోజులూ నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో వున్నాయని, వీటిని వినియోగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. డయేరియా వంటి వ్యాధులు మళ్లీ ఎక్కడైనా ప్రబలినట్లయితే సహించబోమని స్పష్టంచేశారు. వాగులు, గెడ్డల నుంచి ప్రజలు తమ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతించాలని చెప్పారు. పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించి సంబంధిత ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. జెడ్పీ సీఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య విద్యార్థులకు బస్సు సౌకర్యం

- ప్రతిపాదనలు పంపిన ప్రిన్సిపాల్

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: వైద్య విద్యార్థులు బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారనే విషయమై వైద్య విద్యార్థులకు రవాణా కష్టాలు..! శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు క్లినికల్ అటాచ్‌మెంట్‌కోసం ఘోషా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రులకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే నిమిత్తం వైద్య విద్య శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ విషయాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం తెలిపారు.

గిరిజన విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సీతంపేట మండలంలోని బుడ్డగూడకు చెందిన గిరిజన విద్యార్థిని సవర లావణ్య మృతిపై విచారణ చేయించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. ఆ విద్యార్థిని పాఠశాలలోనే రిబ్బన్‌తో ఉరివేసుకుందంటే దాని వెనుక పెద్దకారణమే దాగిఉంటుందని విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని తూనిక వేస్తున్న ఎస్సై వెంకట సురేష్

పాచిపెంట: ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ బాన్, మహారాష్ట్రకు చెందిన జితేంద్ర రాజుల నుంచి పదికిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్ సురేష్ శుక్రవారం తెలిపారు. వారిద్దరూ ఒడిశా నుంచి పది కిలోల గంజాయిని చాపరాయివలస మీదుగా సాలూరు తరలిస్తుండగా చాపరాయివలస వద్ద వారిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

సందడిగా గురుకులాల సైన్స్ ఫెయిర్



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం నెల్లిమర్ల పాఠశాలలో శుక్రవారం సందడిగా జరిగింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పది పాఠశాలల నుంచి 103 మంది బాలికలు, 53 మంది బాలురు కార్యక్రమంలో పాల్గొని 130 ప్రాజెక్టులను ప్రదర్శించారు. గురుకులాల సమన్వయకర్త టీఎం ఫ్లోరెన్స్, డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, నెల్లిమర్ల ఎంఈఓలు, ఉపాధ్యాయులు సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎం.కస్తూరావు తదితరులు ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా గురుకులాల సమన్వయకర్త తెలిపారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం సీతారామచంద్రస్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న దీపారాధన వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం సహస్ర దీపాలంకరణ వేడుకను ప్రారంభించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఊయల్లో స్వామి వారిని వేంచేంపుజేసి దీపపు కాంతుల శోభలో ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹254

వారేమి చేశారు పాపం..!

ఆ చిరుద్యోగుల మొర ఎవరు ఆలకిస్తారు? ఆ అభాగ్యులు ఏ భగవంతుడికి నివేదించుకోగలరు? వారి వేదన పట్టించుకునే నాయకులు కానీ..అధికారులు కానీ ఎక్కడుంటారు? అరకొర వేతనంతో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరువేతన జీవులపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. అంతే తక్షణమే పావులు కదిపారు. తమ పలుకుబడిని ఉపయోగించి వారి ఉద్యోగాలు ఊడగొట్టారు. మేమేమి నేరం చేశామని, మాపై కక్ష గట్టి మా బతుకుల్లో నీళ్లు పోశారంటూ ఉద్యోగాలు కోల్పోయిన ఆ చిరు వేతన జీవులు కంటికి మింటికీ ఏకధారగా వాపోతున్నారు.

- రెండు పాఠశాలల్లో వాచ్‌మన్‌ల తొలగింపు
- ఆయాలకు కూడా ఉద్వాసన
- టీడీపీ నేతల నిర్వాకం



పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గంట్యాడ: అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన టీడీపీ నేతలు అధికారం చేపట్టిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న వాచ్‌మన్, కుక్‌లను ఇప్పటికే తొలగించారు. అదేవిధంగా ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను తొలగించారు. వెలుగులో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (గ్రామ సంఘం సహాయకులు)ను తొలగించారు. తాజాగా ఇప్పుడు పాఠశాలల్లో పనిచేస్తున్న వాచ్‌మన్, ఆయాలను తొలగించేపనిలో ఉన్నారు. ఈ మేరకు పెంట శ్రీరాంపురం హైస్కూల్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్‌ను, పెదవేమలి హైస్కూల్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్‌ను కూడా తొలగించారు. పెంట శ్రీరాంపురం స్కూల్‌లో పనిచేస్తున్న ఆయాను, పొల్లంకి స్కూల్‌లో పనిచేస్తున్న ఆయాను కూడా తొలగించేశారు. మరికొన్ని పాఠశాలల్లో కూడా తొలగించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంత్రి బంధువే అధికారులకు ఆదేశాలు

జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత మండలం గంట్యాడ. మంత్రి సొంత మండలంలోనే టీడీపీ నేతలు రెచ్చిపోతున్నా పట్టించునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వాచ్‌మన్, ఆయాలను తొలగించాలని మంత్రి బంధువు ఒకరు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా వారు చెప్పినా ఎందుకు వాచ్‌మన్, ఆయాలను తొలగించలేదని అధికారులపై సదరు మంత్రి బంధువు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే తొలగించకపోతే పరిస్థితి వేరేగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో చేసేది లేక వాచ్‌మన్, ఆయాలను అధికారులు తొలగిస్తున్నారు. టీడీపీ నేతల వేధింపులు ఎక్కువ కావడంతో ఉద్యోగులు హడలిపోతున్నారు. అధికార పార్టీ నేతల మాటలు వింటే చిక్కుల్లో పడతామని, వినకపోతే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తమలో తామే మథనపడుతున్నట్లు సమాచారం.

తొలగింపు నిజమే..

పెదవేమలి, పెంట శ్రీరాంపురం స్కూల్స్‌లో వాచ్‌మెన్, పెంట శ్రీరాంపురం, పొల్లంకి ఆయాలను తొలగించిన మాట వాస్తవమే. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానం మేరకు తొలగించాం.

సీహెచ్. వెంకటరావు, ఎంఈఓ–2,
ఆదిలక్ష్మి, పెదవేమలి హైస్కూల్ హెచ్‌ఎం

దాడులు అరికట్టకపోతే చట్టపరమైన పోరాటం

- ఎమ్మెల్సీ విక్రాంత్



పెంటన్నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ దాడులు ఆపకుంటే చట్టపరమైన పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాజాం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేగిడి మండలం కోడిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నెల్లి పెంటన్నాయుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పెంటన్నాయుడికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాడుల పాలన జరుగుతోందని ధ్వజమెత్తారు. ప్రజలనుంచి ప్రభుత్వంపై తిరుగుబాటు వస్తోందని, ఈ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు కూటమి ప్రభుత్వం దాడులు చేస్తూ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెడుతోందని మండిపడ్డారు. పెంటన్నాయుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రేగిడి మండల వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పెంటన్నాయుడిని మెరుగైన వైద్యం నిమిత్తం శుక్రవారం రాజాం ఏరియా ఆస్పత్రి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీల్లో సత్తా



జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీల్లో సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.అరుణ్‌కుమార్ తెలిపారు. జూలై నెలలో ముంబైలో నిర్వహించిన రంగోత్సవ్‌లో పాల్గొన్న 12 మంది విద్యార్థులు అవార్డులు దక్కించుకున్నారన్నారు. అవార్డులు పొందిన వారిలో రంభకీర్తన, స్టీఫెన్‌పాల్, కాపుగంటి జ్యోత్స్న, కాపుగంటి శ్రుతి, సిమ్మ ప్రజ్వలిత, గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ నలుగురు, బ్రాంజ్ మెడల్స్‌ను మిగిలిన ముగ్గురు విద్యార్థులు సాధించి ప్రశంసాపత్రాలు పొందినట్లు హెచ్‌ఎం వివరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాడితో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కన్న కూతురి ముచ్చట తీర్చడానికి వెళ్లి తండ్రి మృతి

- లారీ ఢీకొట్టడంతో ప్రమాదం
- మరో ఇద్దరికి గాయాలు



మృతుడు సత్య నారాయణ (ఫైల్)



గాయపడిన శిరీష

బొబ్బిలి: కన్నకూతురి ముచ్చట తీర్చేందుకు పట్టణానికి వచ్చిన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. బొబ్బిలిలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ విషాద సంఘటనపై సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ(30) శుక్రవారం సాయంత్రం తన కుమార్తె శిరీషకు నూడిల్స్ కొనేందుకు ఆమెతో కలిసి బొబ్బిలి వచ్చాడు.రాత్రి 8 గంటల ప్రాంతంలో తిరుగుప్రయాణం అవుతుండగా ఫ్లైఓవర్‌పై వెనుక నుంచి వస్తున్న లారీ ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టడంతో సత్యనారాయణ మోటార్‌సైకిల్‌పై నుంచి పక్కకు పడిపోగా తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోయాయి. దీంతో ఛిద్రమైన సత్యనారాయణ తల భాగం రహదారి పొడవునా ముక్కలుగా పడగా..మోటారుసైకిల్ లారీ చక్రాలకు చిక్కుకుంది. ఈ ప్రమాదానికి గమనించిన కొంతమంది స్థానిక ఐటీఐ వద్ద లారీని అడ్డుకున్నారు. మోటార్ సైకిల్‌పై ఉన్న కుమార్తె శిరీష మరో వైపు పడిపోవడంతో స్వల్పగాయాలతో బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సత్యనారాయణకు భార్య ఇందుమతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ గ్రోత్ సెంటర్‌లో ఇటీవలే కలాసీగా గుర్తింపు పొంది పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకుని వచ్చిన భార్య, తండ్రి తిరుపతిరావు, తల్లి సత్యవతి సంఘటనా స్థలంలో రోదిస్తున్న తీరు చూపరులకు కన్నీళ్లు తెప్పించింది.

ఇదే ప్రమాదంలో మరొకరు మృతి..

కాగా ఇదే ప్రమాదంలో వెనుకనుంచి వస్తున్న మరో ఇద్దరు మోటారు సైక్లిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన ప్రదేశంలో వెనుకనుంచి వస్తున్న వీరు అదుపు తప్పి మోటారు సైకిళ్లతో పడిపోవడంతో గాయాలు కాగా విశాల్‌ను విజయనగరం అస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. జశ్వంత్ స్థానిక సీహెచ్‌సిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి 'స్పెల్'బీతో పోటీ స్ఫూర్తి



పెదతాడివాడ నేషనల్ స్కూల్‌లో జరిగిన స్పెల్ బి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో వాఫీ, టిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త నిర్వహణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెల్ బి పోటీలు విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని నింపాయి. పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి ప్రతిభావంతుల ఎంపిక కోసం స్థానిక పెదతాడివాడలోని నేషనల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలల బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభ చాటుకున్నారు. ఈ పోటీలను చినతాడివాడ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజారావు, డైరెక్టర్ ఎలిషేబా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న పలువురు విద్యార్థులు మాట్లాడుతూ స్పెల్ బి పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లీష్ సబ్జెక్టులో భయం పోయిందని సంతోషం వెలిబుచ్చారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- గుర్లలో పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఇతర అధికారులు

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా తగ్గుముఖం పట్టిందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి డయేరియా కేసులు తగ్గుముఖం పట్టడానికి తీసుకున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్యం, మంచి నీటి సరఫరా వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సెప్టిక్ ట్యాంకుల వల్ల భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డయేరియా కేసులు క్రమేపీ తగ్గుముఖం పట్టాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

డయేరియా కాదు విబ్రో కలరా

ఇప్పటివరకు ఒక్కరు మాత్రమే డయేరియాతో మృతి చెందారని తెలియజేశారు. మిగిలిన వారు వివిధ అనారోగ్యాలతో మరణించారన్నారు. గ్రామంలో ఉన్న వ్యాధి డయేరియా కాదని విబ్రో కలరాగా గుర్తించామని చెప్పారు. ప్రతి 20 ఇళ్లకు ఒక ఏఎన్ఎంను పర్యవేక్షణ అధికారిగా నియమించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణమే వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. గ్రామంలో పర్యటించిన వారిలో రాష్ట్ర మెడికల్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి, డీఎంహెచ్ఓ భాస్కరరావు, డీపీఓ వెంకటేశ్వరరావు, ఆర్డీఓ సత్యవాణి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీరఘట్టం: ఈనెల 3న గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన వీరఘట్టం మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన రఘుమండల జనార్దనరావు(60) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పదహారు రోజులుగా శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జనార్దన రావు శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. మద్యం అలవాటు ఉన్న జనార్దనరావుకు ఆరోగ్యం క్షీణిస్తుండడంతో మద్యం తాగవద్దని కొడుకు యోగేశ్వరరావు, భార్య గౌరీశ్వరిలు ఈనెల 3న మందలించడంతో మనస్తాపం చెంది గడ్డి మందుతాగేశాడు. ఈ మేరకు మృతుడి కుమారుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీడీవీకేను వినియోగించుకోవాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



నిర్మాణ దశలో ఉన్న వీడీవీకేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ డెప్పివలస గ్రామంలో నిర్మితమవుతున్న వన్ ధన్ వికాస్ కేంద్రా(వీడీవీకే)న్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మహిళలకు పిలుపునిచ్చారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన డోకిశీల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న వీడీవీకేను సందర్శించి, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో నిర్మిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రం త్వరలో పూర్తికానుందని, ఈ కేంద్రాన్ని ఇక్కడి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇక్కడి గిరిజనులకు కొండచీపుళ్ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారని, కేంద్రం సిద్ధం కాగానే ఉత్పత్తులు ప్రారంభం కావాలని కోరారు. వీడీవీకేలు కేవలం ఒక సీజన్ వస్తువులకే పరిమితం కాకుండా ఏడాది మొత్తం కేంద్రంనుంచి ఉత్పత్తులు వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజలకు ఇష్టమైన రంగాలను ఎంచుకోవచ్చని, వాటిలో తగిన శిక్షణ ఇప్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అల్లికలు, కుట్టుపనులు కొందరు మహిళలు చేస్తుంటారని, వాటిలో కూడా తగిన తర్ఫీదును ఇప్పిస్తామని కలెక్టర్ చెప్పారు. ఇలా ఏడాది మొత్తం వీడీవీకేల నుంచి ఉత్పత్తులు లభించడం ద్వారా మహిళలకు పని, ఆదాయం సమకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ఈ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ఉత్పత్తులు రానున్నాయని ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, డీఎల్‌డీఓ రమేష్, రమణ, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీఓ రూపేష్ కుమార్, సీడీపీఓ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- 21 నుంచి హిందూపురంలో స్కూల్‌గేమ్స్ అండర్–17 పోటీలు



అండర్-17 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలుర జట్టు



ఎంపికైన బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించాల్సిన ఎంపిక పోటీలు వర్షం కారణంగా వాయిదా వేయగా.. శుక్రవారం రాజీవ్‌క్రీడామైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో 120 మంది బాలురు, 60 మంది బాలికలు పాల్గొన్నారు. వారికి ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించగా..ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలకు ప్రధాన జట్టులో అవకాశం కల్పించారు. అంతేకాకుండా ఇరు జట్లకు మరో 8 మంది క్రీడాకారులను స్టాండ్‌బైలుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో జరగనున్న అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఎఎస్.రాజులు అభినందించారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రైతుకు ఎరువు కరువు..!

- అరకొరగా సరఫరాతో ఇక్కట్లు
- మండల సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు
- జీఓ ప్రకారం అధికారులు నడుచుకోవాలి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



ఎరువుల సరఫరాపై ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పూసపాటిరేగ: అరకొరగా ఎరువులు సరఫరా చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. ఈ మేరకు శుక్రవారం పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు అందడం లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ అధికారి కె.నీలిమ దీనిపై మాట్లాడుతూ ఎరువులు గతంలో కంటే తక్కువగా వస్తున్నాయని, రైతులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తామని చెప్పడంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే జెడ్పీ చైర్మన్ కలగచేసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు సరఫరా చేయాలని వ్యవసాయ అధికారికి తెలియజేశారు. మండల పరిధిలో 5,052 ఎకరాల్లో ఈక్రాప్ నమోదు జరిగినట్లు ఆమె తెలిపారు. 6983 మంది రైతులకు పీఎం కిసాన్ మంజూరు చేశామని వ్యవసాయ అధికారి తెలియచేయగా రైతుభరోసా ఎప్పుడు మంజూరు చేస్తారని సభ్యులు అల్లాడ రమేష్, పిన్నింటి కుమార్ తదితరులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రైతులకు రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం మంజూరు చేయకుండా చేతులెత్తేసిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు.

ఏ ప్రాతిపదికన ఉపాధి పనులు

పల్లెపండగ కార్యక్రమంలో గ్రామాలకు ఉపాధిహామీ పనులు ఏప్రాతిపదికన మంజూరు చేశారని సభ్యులు ప్రశ్నించగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి కలుగజేసుకుని మాట్లాడుతూ గ్రామాలకు ఏపనులు కావాలో అడగండి తప్ప..మంజూరైన పనులను ఆపాలని అనవద్దన్నారు. దీనిపై ఉపాధిహామీ పనులు ఎలా మంజూరు చేశారో జీఓ కాపీ చదవాలని మండల ఇంజినీరింగ్ అధికారికి ఆమె సూచించారు. జీఓ చదవడంతో పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు చేయాలని, ఆయన చేయనప్పుడు వెండర్‌కు పనులు అప్పగించాలని జీఓలో స్పష్టంగా ఉందని జెడ్పీచైర్మన్ తెలియజేశారు. 50 శాతం ఉపాధిహామీ పనులు పంచాయతీ బోర్డు నిబంధనల మేరకు చేపట్టాలని స్పష్టం చేశారు. కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని పీసీబీ అధికారులను సమావేశానికి పిలవాలని సభ్యులు కోరగా ఎమ్మెల్యే నాగమాధవి స్పందిస్తూ కాలుష్యనియంత్రణ మండలి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, అందరు సభ్యులు సమావేశానికి రావాలని సభలో పిలుపునిచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, జూనియర్ లైన్‌మెన్ పంచాయతీ అధ్వర్యంలో పనిచేయాలని ఏఈ దేముడును పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ గ్రామాల వారీగా పనులు చేస్తామని సభాముఖంగా తెలియజేశారు. చింతపల్లిలో జెట్టీ స్థలం ఆక్రమణకు గురవుతోందని, దానిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి బి.శాంతకుమారి, ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు సంస్కృత పాఠశాల విద్యార్థి



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన వల్లెపు ధనుంజయరాజు

పార్వతీపురంటౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయం ఆవరణలో నిర్వహించిన పోటీల్లో జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థి వల్లెపు ధనుంజయరాజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.హేమ సుందర రావునాయుడు తెలిపారు. అనంతపురంలో ఈనెల 29, 30వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ధనుంజయరాజు పాల్గొంటాడన్నారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి కోటేశ్వరరావు, చొక్కాపు శ్రీనివాసరావు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, అనుపోజు వరలక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి తదితరులు విద్యార్థి ధనుంజరారాజును, సంస్కృత పండితుడు జేబీ తిరుమలాచార్యులు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఉత్తరావిల్లి గోవిందరావులను అభినందించారు.